నమస్తే తెలంగాణ

# కరీంనగర్

5 | కరీంనగర్, శుక్రవారం 24 జనవరి 2025 | KARIMNAGAR

# రసాభాస.. రచ్చ రచ్చ

## మూడోరోజూ గ్రామసభల్లో తిరగబడ్డ జనం

- ఊరూరా వెల్లువెత్తిన నిరసనలు
- పథకాలు ఉన్నోళ్లకేనా అంటూ నిలదీతలు
- అనర్హులను ఎంపిక చేశారంటూ ప్రజాగ్రహం
- అంతటా సభల్లో గందరగోళం
- సమాధానం చెప్పలేకపోయిన అధికారులు
- పోలీసులతో అడ్డుకునే ప్రయత్నంపై విమర్శలు

**నాలుగు పథకాల అమలుపై** నిర్వహిస్తున్న గ్రామసభలు గందరగోళంగా సాగుతున్నాయి. మొదటి రోజు మంగళవారం నుంచి రసాభాసగా నడుస్తున్నాయి. మూడో రోజూ అదే తీరున సాగాయి. గురువారం ఎక్కడ చూసినా రచ్చరచ్చ అయ్యాయి. నిలదీతలు.. నిరసనలతో అట్టుడికాయి. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులకు సంబంధించిన జాబితాలను చదువుతుండగా, మెజార్టీ గ్రామాల్లో ప్రజలు అభ్యంతరం తెలిపారు. అర్హుల పేర్లు గల్లంతయ్యాయని, అనర్హులకు అవకాశం కల్పించారంటూ అధికారులపై విరుచుకుపడ్డారు. అన్ని పథకాలు ఉన్నోళ్లకేనా..? గరీబోళ్లకు ఇవ్వరా..? అంటూ ప్రశ్నించారు. ఏ ఒక్క దానిలోనైనా చోటు కల్పించరా అని నిలదీశారు. అర్హతలున్నా తమకు అన్యాయం జేస్తరా..? తాము అర్హులం కాదా..? ఎందుకీ గ్రామ సభలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందడం లేదని, జాబితాలు తప్పల తడకలా తయారు చేశారని ధ్వజమెత్తారు. దాంతో ఆయాచోట్ల సమాధానం చెప్పలేక అధికారులు ఉక్కిరిబిక్కిరయ్యారు. మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అయినా ప్రజలు వినకుండా.. ఇంకా ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని ప్రశ్నించారు. కొన్నిచోట్ల పోలీస్‌లతో అడ్డుకునే ప్రయత్నం చేయగా, మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు.

**- కరీంనగర్, జనవరి 23 (నమస్తే తెలంగాణ)**



అధికారులను నిలదీస్తున్న రైతు మెండె మల్లేశం

### రుణమాఫీ సంగతేంది?

జూలపల్లి, జనవరి 23 : జూలపల్లి గ్రామసభలో రైతులు, మహిళలు ఆగ్రహించారు. అధికారులు జాబితాలోని పేర్లు చదువుతుండగా, ₹2 లక్షలపైన పంట రుణమాఫీ కోసం నిలదీశారు. ఒక్క జూలపల్లిలోనే 212 మందికి మాఫీ కావాల్సి ఉన్నదని, వారికి ఇంకెప్పుడు మాఫీ చేస్తారని ప్రశ్నించారు. పథకాలన్నీ ఉన్నోళ్లకేనా..? కూలీ పనులు చేసుకునేటోళ్లకు వర్తించవా..? అంటూ విరుచుకుపడ్డారు. అధికారులు, రైతులు, మహిళల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరగ్గా, పోలీసులు నిలువరించారు.

### గరీబోళ్లకు సాయం చేయరా..?



మా ఊరు జూలపల్లి. మాకేం ఆస్తిపాస్తులు లేవు. గుంట భూమి కూడా లేదు. చిన్న ఇట్ల కిరాయి తీసుకుని ఉంటున్నం. నాకు భర్త, ఇద్దరు పిల్లలు. రోజూ కూలీ పనులు చేస్కొని బతుకుతం. రేషన్ కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు పెట్టుకున్న. నా పేరు ఏ జాబితాలో కూడా రాలేదు. మరోసారి దరఖాస్తు పెట్టుకోమంటున్నరు. నేనేం పాపం జేసిన? సర్కారు మాలాంటోళ్లను పట్టించుకోదా..? గరీబోళ్లకు సాయం చేయరా..?

**- కట్ట సత్యమ్మ, జూలపల్లి**



సుల్తానాబాద్ రూరల్: దేవునిపల్లిలో ఇందిరమ్మ ఇంటి కోసం అధికారులను నిలదీస్తున్న వృద్ధురాలు శాంతవ్వ

### కాల్మొక్తా.. అర్హులందరికీ ఇవ్వండి!

కమాన్‌పూర్, జనవరి 23 : కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామసభ గందరగోళం మధ్య ప్రారంభమైంది. గ్రామ మాజీ ఉప సర్పంచ్ పోలుదాసరి సాయికుమార్ తమ గ్రామంలోని అర్హులైన వారందరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు ఎంపిక చేయాలని ఎంపీడీవోతో పాటు అధికారుల కాళ్లపై పడి ప్రాధేయపడ్డారు. అధికారులు సమావేశం నుంచి వెళ్లకుండా ప్రజలు అడ్డుకునే ప్రయత్నం చేయగా, పోలీసుల బందోబస్తు మధ్య వారిని గ్రామ సభ నుండి పంపించారు.



కమాన్‌పూర్: జూలపల్లిలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని అధికారుల కాళ్లపై పడి వేడుకున్న గ్రామ మాజీ ఉప సర్పంచ్ పోలుదాసరి సాయికుమార్



కొడిమ్యాల: రామకిష్టాపూర్‌లో రుణమాఫీ కాలేదని ఎంపీడీవోను ప్రశ్నిస్తున్న ప్రజలు

### నేతల అత్యుత్సాహం!

కోరుట్ల రూరల్/ ఎల్లారెడ్డిపేట, జనవరి 23 : అధికారికంగా నిర్వహిస్తున్న గ్రామసభల వేదికలపై కాంగ్రెస్ నాయకులు కూర్చోవడం విమర్శలకు తావిస్తున్నది. పలుచోట్ల అత్యుత్సాహం ప్రదర్శిస్తుండడం, దరఖాస్తుదారులను బెదిరిస్తుండడంపై అసహనం వ్యక్తమవుతున్నది. కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఐలాపూర్‌లో ఏకంగా వేదికపై కూర్చున్నారు. ఎల్లారెడ్డిపేటలో నాయకుడు వేదికపై కూర్చోగా.. మరో ఇద్దరు నాయకులు బెదిరింపులకు దిగారు. దీంతో ప్రజలు కూడా దీటుగా ఎదురుతిరగడంతో పోలీసులు జోక్యం చేసుకొని శాంతింపజేశారు.



ఎల్లారెడ్డిపేట: పథకాలపై మాట్లాడుతున్న ప్రజలను వారిస్తున్న కాంగ్రెస్ నాయకులు

### మేం అర్హులం కాదా..?

ఎండపల్లిలో అధికారులను నిలదీసిన మహిళలు



ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో తమ పేర్లు ఎందుకు రాలేదని అధికారులను నిలదీస్తున్న మహిళలు

వెల్గటూర్, జనవరి 23 : ఎండపల్లి మండల కేంద్రంలో మహిళలు ఆగ్రహించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి తామెందుకు అర్హులం కాదంటూ అధికారులను నిలదీశారు. కూలీ, ఉపాధి పనులు చేసుకొని బతికే తమకు పథకాలు ఇవ్వరా.. అంటూ విరుచుకుపడ్డారు. భూములు, జాగలు ఉన్నోళ్లకే ఇస్తారా..? ఏం లేని తమకు ఇవ్వారా..? అంటూ మండిపడ్డారు. దీంతో కాసేపు సభలో గందరగోళం నెలకొన్నది.

### ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై నిలదీత



చెర్లబూత్కూర్‌లో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

కరీంనగర్‌రూరల్, జనవరి 23 : కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితా చదువుతుండగా, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో దరఖాస్తు చేసుకున్న అందరికీ ఇండ్ల వస్తున్నాయా..? అని ప్రశ్నించారు. ఎంపిక చేసిన పేర్లు చెప్పాలని, లబ్ధిదారుల ఎంపిక కాకుండా గ్రామసభలో ఆమోదం ఎలా ఉంటుందని నిలదీశారు.



కమాన్‌పూర్: ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని పంచాయతీ కార్యాలయంలో బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళలు



జూలపల్లి : అధికారులను నిలదీస్తున్న జనం



సైదాబాద్‌లో కింద కూర్చుని నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

## కొట్టి సంపుతరా ఏంది?

- గ్రామ సభకు ఇంత మంది పోలీసులెందుకు?
- ప్రశ్నిస్తే కేసులు పెడుతరా..?
- ఎన్నిసార్లు దరఖాస్తులు పెట్టాలె?
- పథకాలు ఇచ్చేదాకా ప్రజల గొంతుకనవుతా
- ఎన్నికల హామీలు నెరవేర్చేదాకా నిద్రపోను
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి
- జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామ సభకు హాజరు
- పథకాల హామీ అమలు కోసం బైఠాయింపు
- అధికారులకు గులాబీ పూలు అందించి నిరసన

జమ్మికుంట, జనవరి 23 : 'హామీలపై ప్రశ్నిస్తే కేసులు పెడతరా..? పథకాల కోసం ఎన్నిసార్లు దరఖాస్తులు పెట్టుకోవాలె. కాంగ్రెస్ ఎన్నికల హామీలు నెరవేర్చాలె. పథకాల అమలయ్యేంత వరకు ప్రజల గొంతుకనవుతా. ప్రశ్నిస్తూనే ఉంటా. ఎన్ని కేసులు పెడతారో.. పెట్టుకోండి. హామీలన్నీ నెరవేర్చేదాకా నిద్రపోను. మిమ్మల్ని నిద్రపోనియ్య' అంటూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'గ్రామ సభకు ఇంత మంది పోలీసులెందుకు? కొట్టి సంపుతరా ఏంది?' అని ప్రశ్నించారు. 'మీకు దండం పెడుతున్నా.. అర్హులందరికీ పథకాలు ఇయ్యండి' అని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం జమ్మికుంట మండలం సైదాబాద్‌లో గ్రామసభను అధికారులు ఏర్పాటు చేశారు. దీనికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వస్తున్నారనే సమాచారం మేరకు డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బందితోపాటు ప్రత్యేక బలగాలు బందోబస్తు నిర్వహించాయి. ఎమ్మెల్యే సభకు రాగానే.. అధికారులు ప్రారంభించారు. పలు పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఎంపికైన పేర్ల జాబితాను చదివి వినిపించారు. వెంటనే స్థానిక ప్రజలు ఒక్కసారిగా లేచి, అర్హులకు పథకాలు ఎందుకియ్యడం లేదంటూ వ్యతిరేక నినాదాలు చేశారు. అప్పటి వరకు స్టేజీ మీద ఉన్న ఎమ్మెల్యే, ప్రజల మధ్యకు వెళ్లారు. వాళ్ల మధ్య కూర్చున్నారు. సమస్యలు తెలుసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించారు. అర్హుల పేర్లు ఎందుకు జాబితాలో లేవో చెప్పాలని అధికారులను ప్రశ్నించారు. ప్రజలు అధికారులను అడిగేందుకు ముందుకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యే కుర్చీ నుంచి దిగి కింద కూర్చున్నారు. అర్హులైన అందరికీ పథకాలు అమలు చేయాలని గులాబీ పూలు అందిస్తూ వినూత్న తరహాలో నిరసన తెలిపారు. పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, పూర్తిస్థాయిలో పథకాలు అమలు కోసం ఉన్నతాధికారుల దృష్టికి ఎమ్మెల్యే విజ్ఞప్తిని తీసుకెళ్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే వెళ్లిపోయారు.

### ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా

**- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి**

ప్రజలను రక్షించాల్సిన పోలీసులు లంచాలు తీసుకుని పనిచేయడం సరికాదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హితవుపలికారు. హుజూరాబాద్ డివిజన్ ఏసీపీ, సీఐలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు. గురువారం ఆయన జమ్మికుంటలో విలేకరులతో మాట్లాడారు. ఓ కేసు విషయంలో జమ్మికుంట సీఐకి 3లక్షల రూపాయల లంచం ఇచ్చానంటూ ఓ ఆడియో సంభాషణ వైరల్ కాగా, దానిపై ఆయన స్పందించారు. డివిజన్ పోలీసుల పనితీరు బాగాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ సంపత్, నాయకులు, తదితరులున్నారు.



చల్లూరు గ్రామసభకు భారీగా మోహరించిన పోలీసు బలగాలు

## చల్లూరులో 150 మంది పోలీసులు

వీణవంక, జనవరి 23: పోలీస్ పహారా మధ్యన గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఎక్కడ చూసినా పెద్దసంఖ్యలో పోలీసులు కనిపిస్తున్నారు. ఎక్కడ ఎవరు ప్రశ్నించినా వారిని అడ్డుకుంటున్నారు. వీణవంక మండలంలోని చల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వస్తున్నారనే సమాచారంతో పోలీసు బలగాలు మోహరించాయి. సుమారు 150 మంది బందోబస్తు ఉన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా పోలీసులు మోహరించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

## మూడు నెలల్లోగా పరిహారం చెల్లించాలి

- లేకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం
- నారాయణపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితులను ఆదుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 23 : నారాయణపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితులను ఆదుకోవాలని, వెంటనే పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. మూడు నెలల్లోగా చెల్లించకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు తెలంగాణ రాకముందు చొప్పదండి నియోజకవర్గంలో సాగునీరు లేక అనేక ఇబ్బందులు పడ్డామని గుర్తు చేశారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత నియోజకవర్గాన్ని ఒక వాటర్ హబ్‌గా మార్చిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. అలాంటి ప్రాంతంలో సాగు సాగడం లేదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సాగు సాగకపోతే రాష్ట్రంలో ఇంత ధాన్యం ఎక్కడి నుంచి పండుతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర మంత్రులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. బీఆర్‌ఎస్ హయాంలో ₹16.50 కోట్ల నిధులను విడుదల చేయించి నిర్వాసితులకు అందించామని గుర్తు చేశారు. రిజర్వాయర్ ఇబ్బందులు తొలగించేందుకు నాలుగు ఓటీలను మంజూరు చేయించి 28 వేల ఎకరాలకు సాగునీరు అందించామని చెప్పారు. కానీ, ఇవాళ భూ నిర్వాసితులు తమ గోడును జిల్లా ఇన్‌చార్జి మంత్రికి విన్నవించుకుందామని వస్తే కూడా కనీసం వినిపించుకునే స్థితిలో లేరని మండిపడ్డారు. ఇన్‌చార్జి మంత్రిగా ఆయన జిల్లా అభివృద్ధికి ఈ 14 నెలల కాలంలో ఏం నిధులు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా కేసీఆర్‌పై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. విమర్శలు మానుకొని జిల్లాను అభివృద్ధి చేసే విషయంలో దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్ బీఆర్‌ఎస్ నాయకులు ఆరే రవి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడాది పాలనలో ఒక్క రేషన్‌కార్డూ ఇచ్చారా..?

- పంచాయతీల ఎన్నికల కోసమే గ్రామసభల డ్రామాలు
- రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్ ధ్వజం

కార్పొరేషన్, జనవరి 23 : పంచాయతీ ఎన్నికల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభల పేరిట డ్రామాలు ఆడుతున్నదని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్ విమర్శించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏడాది పాలనలో ఒక్క రేషన్ కార్డయినా ఇచ్చారా..? అని ప్రశ్నించారు. ఆయనవి అన్ని ఉత్త మాటలే తప్పా అయ్యేది లేదు పొయ్యేది లేదని ఎద్దేవా చేశారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ ఎన్నికలు లేకపోవడంతో 14 నెలలుగా కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని, ఆ నిధుల కోసమే ప్రభుత్వం గత్తర పడుతున్నదని విమర్శించారు. ప్రజలను పక్కదారి పట్టించి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈ గ్రామ సభలు నిర్వహిస్తున్నదన్నారు. అసలు సభల్లో ప్రకటిస్తున్నట్టు ఎంతమందికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పుల కోసం గతంలోనే ఆన్‌లైన్‌లో లక్షల దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిగణలోకి తీసుకున్నారో లేదో చెప్పాలన్నారు. సభల్లోనే సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అది ఎక్కడా కనిపించలేదన్నారు. గ్రామసభల్లో తీసుకుంటున్న దరఖాస్తులకు కనీసం రసీదు కూడా ఇవ్వడం లేదన్నారు. ఇప్పటివరకు సంక్షేమ పథకాల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎంతమందిని ఎంపిక చేశారో అన్న విషయాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలకు పెట్టిన ఆదాయపరిమితిని పెంచాలని, ప్రభుత్వానికి దమ్ముంటే కులగణన లిస్టును బయటపెట్టాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎడ్ల అశోక్, పెండ్యాల మహేశ్‌కుమార్, గుంజపడుగు హరి ప్రసాద్, కెసారం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్